



నోటిఫికేషన్

స్థానిక సంస్థల ఎన్నికలు ముచ్చటగా మూడో సారి వాయిదా పడినట్లేనా అనే దానిపై న్యాయ నిపుణులు అవుననే సమాధానం చెబుతున్నారు. హైకోర్టు ఎన్నికలపై స్టే విధించడంతో స్థానిక ఎన్నికలు మరోసారి సందిగ్ధంలో పడ్డాయి. హైకోర్టు తీర్పుతో బీసీ వర్గాల్లో నిరాశే మిగలుగా పోటీ చేయాలనుకునే ఆశావహులకు నిరుత్సాహం ఎదురైంది. అయితే కోర్టుస్టే విధించడంతో ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఎన్నికలకు ముందుకు వెళ్తారా లేదా వాయిదా వేస్తారా, వేరే ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను జారీ చేయడంతో పాటు జిల్లాల వారీగా గురువారం జడ్పీటీసీ, ఎంపీటీసీ మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యాయి. దీంతో పాటు నామినేషన్‌ల ప్రక్రియ కూడా మొదలైంది. కోర్టు తీర్పుతో ఈ ఎన్నికలకు బ్రేక్ పడినట్లే.

- ఎన్నికలపై స్టే విధించిన హైకోర్టు
- ఇప్పటికే జిల్లాలో ప్రకటన జారీ
- జడ్పీటీసీ, ఎంపీటీసీల నామినేషన్ల ప్రక్రియ షురూ
- కోర్టు స్టేతో ప్రక్రియకు బ్రేక్ పడినట్లేనా?
- ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఏ నిర్ణయం తీసుకుంటుందో?

కామారెడ్డి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటరు జాబితాతో పాటు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడం చివరకు నోటిఫికేషన్‌లు సైతం జారీ చేశారు. జిల్లాలో మొదటి విడత కింద 14 జడ్పీటీసీ, 136 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నామినేషన్ల ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ల కోసం పూర్తి ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల పత్రాలను, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచారు. కొందరు పోటీ చేయాలనుకునే వారు కేంద్రాల నుంచి నామినేషన్ల పత్రాలను సైతం తీసుకెళ్లారు. కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఇలా మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు చేసినప్పటికీ కోర్టు తీర్పుతో ఎన్నికలు ముందుకు సాగుతాయా లేదా చూడాలి.

కోర్టు నిర్ణయంతో ఆశావహుల్లో నిరాశ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు జీవో 9ని తీసుకువచ్చింది. ఈ జీవో ప్రకారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు సైతం ఖరారు చేశారు. అయితే రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన వాదనలు విన్న హైకోర్టు ఎన్నికలపై స్టేవిధించింది. దీంతో పోటీ చేయాలనుకునే ఆశావహులకు నిరాశే మిగిలింది. ఇక బీసీ వర్గాలు తీవ్రంగా నిరాశకు గురయ్యారు. ఎన్నికల్లోనే కాకుండా ఉద్యోగాల్లో, ఇతర రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు వస్తాయని ఆశించిన బీసీ వర్గాలు చివరకు కోర్టు స్టే విధించడంతో నిరాశ చెందారు.

రెండు చోట్ల ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు

- భిక్కనూరు, గాంధారిలో దాఖలు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో గురువారం స్వీకరించిన నామినేషన్లు ప్రక్రియలో ఎంపీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు రాగా జడ్పీటీసీ స్థానాలకు గురువారం మొదటిరోజు ఎలాంటి నామినేషన్‌లు రాలేదు. కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూరు మండలంలో బస్వాపూర్ ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కరు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండలంలో సీతాయిపల్లి ఎంపీటీసీ స్థానానికి బీఆర్‌ఎస్ తరుపున ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ పత్రాలను పలువురు తీసుకెళ్లినప్పటికీ హైకోర్టు ఎన్నికలపై స్టే విధించడంతో నామినేషన్ల స్వీకరణ ఉంటుందో లేదో వేచి చూడాలి.



తాడ్వాయిలో నామినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

నామినేషన్ కేంద్రాల పరిశీలన

తాడ్వాయి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీల, జడ్పీటీసీల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో జిల్లాలోని నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించారు. గురువారం తాడ్వాయి మండలంలోని మండల కార్యాలయంలో గల నామినేషన్ కేంద్రాలను వాటి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్ని ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేశారు. ఏ విధంగా నామినేషన్లు తీసుకుంటున్నారు అన్ని ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక రిటర్నింగ్ ఆఫీసర్ దగ్గరికి వెళ్లి ఏర్పాట్లను క్షుణంగా పరిశీలించారు. రోజు వారీగా చేపట్టే కార్యక్రమాలను ఆర్వోలని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అంతే కాకుండా నామినేషన్ వేసే వాళ్లకి ఇబ్బంది కలుగకుండా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలో గల ఏటీసీ సెంటరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో రోడ్డు మరమ్మతులు రోడ్డు ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపాలని ఎమ్మార్వోను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎమ్మార్వో శ్వేతా, ఎంపీవో సవిత, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు దుర్గాప్రసాద్, రామస్వామి, నర్సింలు, మధు, ఆర్‌ఐ హారిక, హన్మండ్లు, రాజేశ్వర్, కల్పన, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

పకడ్బందీ ఏర్పాట్లు..

సదాశివనగర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఎన్నికల కోసం నామినేషన్ పత్రాల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 12 ఎంపీటీసీ, ఒక జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ల స్వీకరణకు నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. నాలుగు ఎంపీటీసీ స్థానాలకు ఒక కౌంటర్ చొప్పున మూడు కౌంటర్‌లు, జడ్పీటీసీకి ఒక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకున్నది

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలే..

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకున్నది బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలేనని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు తర్వాత ఆయన మాట్లాడారు. గవర్నర్ వద్ద, పార్లమెంట్‌లో అడ్డుకున్నది బీజేపీ అయితే కోర్టులో కేసు వేసి అడ్డుకున్నది బీఆర్‌ఎస్ అని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించామని హైకోర్టు ఇలా మధ్యంతర స్టే విధిస్తుందని అనుకోలేదని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుల సర్వేలు నిర్వహించి కృతనిశ్చయంతో వన్ మెన్ కమిషన్ వేసి కేబినెట్ ఆమోదం కూడా తెలిపి శాసనసభలో చట్టం చేసి గవర్నర్‌కు పంపించారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి నిధులు రావడం లేదని గ్రామాలు అభివృద్ధి చేయలేకపోతున్నామని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాటకాలను ప్రజల ముందు ఉంచుతామని కోర్టులో మరింత గట్టిగా వాదనలు వినిపించి 42 శాతానికి అనుకూలంగా తీర్పు వచ్చేవిధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సదాశివనగర్ విద్యార్థులు

సదాశివనగర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్ గురువారం తెలిపారు. అక్టోబరు 7న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్ 19 కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన కళ్లెం సౌందర్య, నేనావత్ చరణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం కళాశాలకే గర్వ కారణమన్నారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి పీడీ రాజేందర్, కళాశాల సిబ్బంది అభినందించారు.



సన్నాలకే మొగ్గు

- బోనస్ ప్రభావంతో పెరిగిన సన్నాల సాగు
- జిల్లాలో 2.85 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఇందులో 85 వేల ఎకరాల్లో సన్నాలు
- 1.88 లక్షల మెట్రిక్ టన్నుల్లో దిగుబడులు వచ్చే అవకాశం
- సన్నాలకు తెగుళ్ల బెడద.. దిగుబడులపై ప్రభావం
- గత సీజన్‌లో రాని సన్నాల బోనస్
- ఈ సీజన్‌లోనైన బోనస్ ప్రభుత్వం ఇచ్చేనా?

కామారెడ్డి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో పాటు గత ఏడాది నుంచి సన్న ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇస్తుండడంతో రైతులు సన్న ధాన్యం సాగుకు మొగ్గు చూపారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,85,825 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 85,748 ఎకరాల్లో సన్నాలు సాగు చేయగా 2 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం సాగైంది. అంతకుముందు గత ఏడాది సన్నాలు కేవలం 60 వేల ఎకరాలకు మించి సాగుచేసిన దాఖలాలు లేవు. అయితే ఈ వానాకాలం సీజన్‌లో 85 వేల ఎకరాలకు పైగా సన్నాలు సాగు చేయడానికి కారణం ప్రభుత్వం బోనస్ ఇవ్వడమే అయితే గత ఏడాది సన్నాలకు సంబంధించి బోనస్ డబ్బులను ప్రభుత్వం ఇప్పటికీ జమ చేయలేదు. దీంతో ఈ సీజన్‌లోనైన బోనస్ డబ్బులు ఇస్తుందా లేదా అని రైతులు అయోమయానికి గురవుతున్నారు.

రైతులకు అదనపు ఆదాయం

జిల్లాలో గత ఏడాది యాసంగి సీజన్‌లో 60 వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేయగా సుమారు లక్ష మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేశారు. క్వింటాల్‌కు రూ.2,310 మద్దతు ధరకు కొనుగోలు చేశారు. అదనంగా ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్ చెల్లించింది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 85,748 ఎకరాల్లో సన్న ధాన్యం సాగు చేశారు. సుమారు ఎకరాన 25 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన 1.88 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

బోనస్‌కు తప్పని నిరీక్షణ

గత యాసంగి సీజన్‌కు సంబంధించి సన్న ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇప్పటికీ ఇవ్వకపోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. యాసంగి సీజన్ ముగిసి వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రారంభమైన బోనస్ డబ్బులు మాత్రం రైతుల ఖాతాలో జమ కాలేదు. గత యాసంగి సీజన్‌లో లక్ష మెట్రిక్ టన్నులకు పైగా సన్న ధాన్యాన్ని 30,700 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే వీరందరికీ మద్దతు ధర డబ్బులను ఆయా రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. కానీ బోనస్ రూ.88 కోట్లు మాత్రం పెండింగ్‌లో ఉంచారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో డబ్బులు రైతుల ఖాతాలో పడుతాయని ప్రభుత్వం చెబుతునప్పటికీ సీజన్ ముగిసి వానాకాలం కొనుగోళ్లు ప్రారంభం అవుతున్నా బోనస్ డబ్బులు మాత్రం ఇవ్వకపోవడంతో

(మిగతా 6వ పేజీలో)



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

బాన్సువాడ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం, హన్మాజీపేట్, కోనాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లు మంజూరై ఇతరితర కారణాలతో అసంపూర్తిగా ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఇళ్లను నిర్మించుకునేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, ఆయా పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 71 దరఖాస్తులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 2025-27 సంవత్సరానికి మద్యం దుకాణాలకు మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత్‌రావు తెలిపారు. కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 18, దోమకొండ స్టేషన్ పరిధిలో మొత్తం 8 దుకాణాలకు 10, ఎల్లారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలో మొత్తం 7 దుకాణాలకు 4, బాన్సువాడ స్టేషన్ పరిధిలో మొత్తం 9 దుకాణాలకు 16, బిచ్కుంద స్టేషన్ పరిధిలో మొత్తం 10 దుకాణాలకు 23 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెండో శనివారం కూడా యదావిధిగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఒకరు ఎన్ని అయినా అప్లికేషన్స్ వేసుకోవచ్చున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలాగా ఎవరైన సిండికేట్‌లుగా ఏర్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ లక్కీడ్రాలో జిల్లావాసి ఎంపిక

కామారెడ్డి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా గత నెల 27 నుంచి ఈనెల 6వ తేదీ వరకు ప్రయాణించిన వారికి బహుమతులు అందించేందుకు ఆర్టీసీ లక్కీడ్రా బాక్సులను ఏర్పాటు చేసింది. ఈ లక్కీడ్రాలో కామారెడ్డి డిపో బస్సులో ప్రయాణించిన రాంప్రసాద్ ఎంపిక కాగా ఆయనకు రూ.10వేలు ఆర్‌ఎం చేతుల మీదుగా అందించినట్లు డీఎం తెలిపారు.



దెబ్బతిన్న రోడ్డుకు మోక్షమెప్పుడో?

- కోతకు గురైన రోడ్డుతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

5

ఆరోగ్యానికి వెరీ గుడ్డు

- గుడ్డు ఆరోగ్యానికి బలవర్ధకమైన ఆహారం
- నేడు వరల్డ్ ఎగ్ డే

కామారెడ్డి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీరోజు ఒక ఉడకపెట్టిన గుడ్డు తింటే ఏ జబ్బులు దరి చేరవని మన అమ్మమ్మలు తాతయ్యలు అంటుంటారు. ఇప్పుడు ప్రస్తుత కాలంలో గుడ్డు మంచి పౌష్టికాహారమని వైద్యులు సైతం అంటున్నారు. నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం. ప్రతీ సంవత్సరం అక్టోబరు రెండవ శుక్రవారం ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. గుడ్డు పోషక విలువలను గుర్తు చేస్తూ, ఆరోగ్యానికి అండగా నిలిచే ఈ చిన్న ఆహారం ప్రాధాన్యాన్ని ప్రజల్లో పెంపొందించాలనే ఉద్దేశ్యంతో 1966 లో అంతర్జాతీయ గుడ్డు కమిషన్ (ఐఈసీ) ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. గుడ్ల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను, దాని పోషక విలువలను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గుడ్డు పరిశ్రమ పాత్రను ప్రజలకు తెలియజేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఫారం గుడ్డు శాకాహారమే. తల్లిపాల తర్వాత గుడ్డు నెంబర్ వన్‌గా గుడ్డులోని పచ్చని సొన కంటి చూపును పెంచే విటమిన్ అధికం. నిత్య యవ్వనాన్ని పెంచే బి కాంప్లెక్స్ ఈ విటమిన్ గర్భిణులు గుడ్లు ఎక్కువ తింటే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. గుడ్డులోని తెల్ల సొన ద్వారా కడుపులో అల్సర్, గ్యాస్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. గుడ్డు బలిష్టమైనది. వ్యాధి నిరోధక శక్తి పెంచుతుంది. తక్కువ క్యాలరీలు కలది. వేడి చేయదు. గుడ్డులో రేలిన్,



అయోడిన్, హిస్టోడిన్ అధికం. కావునా పిల్లల్లో జ్ఞాపకశక్తి, బరువు పెంచుతుందని వైద్యులు అంటున్నారు. గుడ్డులోని అసంపూర్తి కొవ్వులు హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను అభివృద్ధి పరిచి గుండె జబ్బులు రాకుండా చేస్తాయి. పచ్చి గుడ్డు ఆమ్లెట్ (మిగతా 6వ పేజీలో)



కంకర వేశారు.. తారు మరిచారు

- నిలిచిన దోంచంద- తడపాకల్ బీటీ రోడ్డు పనులు
- మూడేళ్లు కావస్తున్నా పూర్తి కాని వైనం
- పట్టించుకోని అధికారులు

5

క్రైం సమాచారం

స్కూటీ నుంచి రూ.1.50 లక్షలు మాయం

బాన్సువాడటౌన్ , అక్టోబరు 09(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ మహిళ స్కూటీ డిక్కీ నుంచి రూ.1.50 లక్షలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్‌హెచ్‌వో అశోక్ కథనం కథనం ప్రకారం.. బోర్లం క్యాంపునకు చెందిన రాజేశ్వరి తన అవసరం నిమిత్తం బ్యాంకులో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.1.50 లక్షల నగదును తీసుకుంది. ఈ నగదును స్కూటీ డిక్కీలో పెట్టి తాను పనిచేస్తున్న ప్రైవేటు వసతిగృహానికి వెళ్లింది. పనిపూర్తి చేసుకుని వచ్చి స్కూటీ డిక్కీ చూడగా అందులో నగదు కనబడలేదు. దొంగలు తన సొత్తును చోరీ చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రలతో దాడి.. 8 మందిపై కేసు

నవీపేట,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(బి) తండాకు చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పాత కక్షలతో గ్రామాలకు చెందిన ఇరుపక్షాల వారు గొడవపడగా గురువారం ఉదయం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. ఇదే సమయంలో కోపోద్రుక్తులైన ఇరుపక్షాల వారు కర్రలతో దాడి చేసుకోగా నీలాబాయి, మోజీరాంలకు గాయాలయ్యాయని, అలాగే మరో పక్షానికి చెందిన సబారి జ్యోతి అనే మహిళకు సైతం గాయాలయ్యాయని ఎస్సై తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జైలు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడిన 10మందిని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. 10మందిలో ఆరుగురికి ఒక రోజు జైలు శిక్ష రూ.1000 జరిమానా, మరో నలుగురికి 2 రోజుల జైలుశిక్ష రూ.1000 జరిమానా విధించినట్లు వివరించారు.

భిక్కనూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి ఒక రోజు జైలు శిక్ష పడినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. దోమకొండ మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన స్వామిగౌడ్‌కు కామారెడ్డి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ ఒక రోజు జైలు శిక్షతో పాటుగా రూ.వెయ్యి జరిమానా విధించారని తెలిపారు.

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నిజామాబాద్‌కు చెందిన మహమూద్‌ఖాన్‌కు 7 రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఇటీవల ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మహమూద్ ఖాన్ పట్టుబడ్డట్లు వివరించారు.

చెరువులో పడి మహిళ మృతి

గాంధారి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగల్ కలాన్ శివారు చెరువులో ప్రమాదవశాత్తు పడి మహిళ మృతిచెందినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. చెరువు వద్దకు బహిర్భుమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు వివరించారు. మృతురాలి కూతురు సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

జూదస్థావరంపై పోలీసుల దాడి

బాన్సువాడటౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సంగమేశ్వర కాలనీలోని జగన్నాథం సతీష్ ఇంట్లో ఆరుగురు జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి కేసు నమోదు చేశామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.23,400 నగదు, 6 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జూద స్థావరాలపై 8712686167కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

కలప దొంగల అరెస్ట్


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మాక్లూర్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి) కలప దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ.95వేల విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిట్టపల్లి శివారులో ఉన్న గోపాల శ్రీధర్ అనే వ్యక్తికి చెందిన మామిడి తోటలోని సుమారు 20 టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకొని దొంగతనంగా కలపను తీసుకెళ్లారు. దీంతో బాధితుడు గత నెల 19వ తేదీన పోలీసులకు ఫిరాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులైన జావేద్, మహమ్మద్ అబ్బాస్‌ను గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.95వేల విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం



రుద్రూర్ బాలుర పాఠశాల విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రుద్రూరు,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి అంతర్ పాఠశాలల అండర్-14, 17 క్రీడోత్సవాలు గురువారం రుద్రూర్ బాలుర పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభించారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన క్రీడకారులు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఇందులో రుద్రూర్ బాలుర పాఠశాల విద్యార్థులు విజేతగా నిలవగా.. కేజీబీవీ విద్యార్థినులు రెండవ బహుమతి పొందారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి, డిస్ట్రిక్ స్పోర్ట్ అధికారి పవన్ కుమార్, జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, పీఆర్‌టీయూ నేత విఠల్‌రెడ్డి, వ్యాపారవేత్త రుద్రూర్ గ్రామవాస్తవ్యుడు బచ్చు రాము, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

కోటగిరి,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్ పేర్కొన్నారు. పోతంగల్ జడ్పీ పాఠశాలలో గురువారం విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి దాబాలపై వైర్లు కట్టి దుస్తులు ఆరవేయకూడదన్నారు. ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఆర్పివేయాలఇ ఆయన సూచించారు. ఇళ్లపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేస్తే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఇందులో ఏఈ ఫక్రొద్దీన్, హెచ్‌ఎం శ్రీవాణి,నాగనాథ్,ఇందిరా,ప్రియదర్శిని పాల్గొన్నారు.

మనసా.. నువ్వు పదిలమా

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

- జిల్లా ప్రజల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు
- అందరిలో ఆందోళన.. వైద్యులను సంప్రదిస్తే మేలు



శరీరానికి ఏమైనా అయితే వెంటనే ఆసుపత్రికి పరుగులు తీస్తాం. మనసుకు గాయమైతే లోలోపలే కుమిలిపోతాం. ఇదే సమాజంలో మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసి.. ఎన్నో విషాధాలకు కారణమవుతోంది. ఏటా వారిలోనే ఎన్నో బాధలు మోస్తూ.. ప్రాణాలు వదులుతున్న వారు అనేకం. ఇందూరు జిల్లాలోనూ ఇలాగే ఎంతో మంది మదనపడుతున్నారు. ఈ నేపథ్యంతో ఏటా అక్టోబర్ 10న జరుపుకొనే 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' మనకు మనసును కూడా కాపాడుకోవాలనే గుర్తు ఇస్తుంది. జాగ్రత్తగా ఉందాం.. చంచలత్వాన్ని వీడి మనసును కాపాడుకుందాం.

- ఇందూరు/కామారెడ్డి టౌన్

పెరుగుతున్న బాధితులు..

జిల్లాలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి కేసులు నిజామాబాద్ జిల్లాలో రెండు మూడేళ్లుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వైద్యాధికారులు చెబుతున్నారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సైకియాట్రిక్ విభాగంలో నెలకు 150-200 మంది డిప్రెషన్, ఆందోళన, ఒంటరితనం, నిద్రలేమి వంటి సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రైవేట్ క్లినిక్‌లలో మాత్రం ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉందని నిపుణుల అంచనా. వైద్యుల వివరాల ప్రకారం ప్రతి వయసులోనూ ఒత్తిడి పెరుగుతోంది. విద్యార్థుల్లో చదువుపై ఒత్తిడి, ఉద్యోగుల్లో ఆర్థిక, కుటుంబ బాధ్యతల ఒత్తిడి, వృద్ధుల్లో ఒంటరితనం కారణాలు.

కరోనా తర్వాత పెరుగుదల

కరోనా మహమ్మారి తర్వాత చాలా మంది ఆర్థిక, కుటుంబ, ఉద్యోగ సమస్యలతో మానసిక స్థిరత్వం కోల్పోయారని వైద్యులు చెబుతున్నారు. 2020-22 మధ్య కాలంలో డిప్రెషన్ కేసులు దాదాపు 40 శాతం పెరిగినట్లు జిల్లా వైద్య శాఖ అంచనా.

పిల్లలు, యువతలో ఆందోళన

డిజిటల్ గాడ్జెట్లు, సోషల్ మీడియా ప్రభావం, పోటీ విద్యా వ్యవస్థ ఇవన్నీ యువతలో మానసిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయని సైకాలజి స్టులు చెబుతున్నారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో కౌన్సిలర్లు చెబుతున్న వివరాల ప్రకారం విద్యార్థుల్లో 30 శాతం మంది ఏదో ఒక స్థాయిలో ఆందోళన, భయం, డిప్రెషన్ అనుభవిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడే సమయం తగ్గిపోవడం ముఖ్య కారణం.

వైద్యులను సంప్రదిస్తే మేలు

తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టెలీ మానస సేవ ద్వారా నిజామాబాద్ జిల్లాలోనూ మానసిక సమస్యలపై సలహాలు అందిస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక సైకియాట్రిస్ట్, సైకాలజిస్టు సేవలు అందుబాటులో ఉన్నా, ప్రజల్లో అవగాహన మాత్రం తక్కువగా ఉంది. వైద్యాధికారులు చెబుతున్నట్లు మానసిక సమస్యలను దాచుకోవడం కంటే వైద్యులను సంప్రదిస్తే త్వరగా పరిష్కారమార్గం దొరుకుతుంది.

మానసిక సమస్యలకు చికిత్స ఉంది



మానసిక సమస్యలకు చికిత్స ఉంది. డిప్రెషన్, ఆందోళన, ప్యానిక్ అటాక్స్ వంటి సమస్యలు సాధారణం. వాటిని దాచి పెట్టి లోలోపలే కుమిలిపోవద్దు. వైద్యులను సంప్రదిస్తే ఇలాంటి సమస్యల నుంచి బయటపడొచ్చు. కానీ ఇంకా మన సమాజంలో మానసిక వైద్యుల వద్దకు వెళితే సిగ్గు అనే భావన ఉంది. ఈ అభిప్రాయాన్ని మార్చాల్సిన సమయం వచ్చింది. మానసిక ఆరోగ్యంపై ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. మన నిజామాబాద్‌లో చికిత్స అందిస్తున్నాం. ప్రజలు మానసిక వైద్యుల సేవలు వినియోగించుకోవాలి.

- డాక్టర్ ఆకుల విశాల్, మానసిక వైద్యుడు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ

బోధన్,అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వెంకట నారాయణ సూచించారు. గురువారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఉద్యోగులు బ్యాంకుకు వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులకు ఎటువంటి డాటా, ఓటీపీలు చెప్పవద్దన్నారు. బ్యాంకుల వద్ద అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఏటీఎం డబ్బులు తీసే దగ్గర సాధారణ వ్యక్తులుగా నిలబడి మోసం చేస్తారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, మాజీ రాష్ట్ర పీఆర్‌టీయూ జనరల్ సెక్రెటరీ రవి కిరణ్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


మహేష్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రిటైర్డ్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సుభాష్

వేల్పూర్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఇటీవల మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ పొందిన వేల్పూర్ మండలం లక్కోరకు చెందిన ఉట్నూర్ సుభాష్ గురువారం పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో మహేష్‌కుమార్ గౌడ్ పార్టీ కండువా కప్పారు. జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని మహేష్‌కుమార్‌గౌడ్ ఆయనకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మార గంగారెడ్డి, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల బోనస్ కాజేయడం సిగ్గుచేటు



కోటగిరిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోటగిరి,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంట పండించే కర్షకుడికి ప్రభుత్వం బోనస్ ఇస్తే కర్షకుడి ముసుగులో ఖద్దర్ చొక్కాలు బోనస్ కాజేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. కోటగిరి సహకార సంఘంలో 618మంది రైతులకు బోనస్ వస్తే.. మండల, జిల్లా నేతలు తమ కుటుంబీకుల పేర్ల మీద సుమారు రూ.4.50 లక్షలు కాజేశారన్నారు. గతంలో విచారణ అధికారిగా అంబర్‌సింగ్‌ను నియమించారన్నారు. విచారణ అధికారి అక్రమార్కులతో చేయి కలిపి అవినీతి బయటకు రానీయలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విచారణ అధికారి అంబర్‌సింగ్‌ను తప్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవి, శ్రీనివాస్ రావు, నజీర్, సంతోష్, గంగాప్రసాద్, విజయ్, అరవింద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన


పడిగెల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వేల్పూర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మ్యాక శ్రీకాంత్ మాట్లాడారు. పిల్లలకు మానసిక ఒత్తిడిని ఏ విధంగా జయించాలనే అంశంపై వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి నారాయణగౌడ్, కోశాధికారి విజయానంద్, జడ్‌సీ పృథ్వీరాజ్, సీనియర్ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి


ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసిన పార్టీ నేతలు

బోధన్,అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లోని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. మండల పార్టీ సీనియర్ నాయకులు పోతారెడ్డి ఆధ్వర్యంలో చిన్నమావంది, పెద్దమావంది తదితర గ్రామాల నాయకులు ఆయన వెంట ఉన్నారు. బోధన్ మండలంలోని ఎంపీపీ,, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల ప్రక్రియపై చర్చించినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.


పోషకాహారంపై సూచనలు ఇస్తున్న ఐసీడీఎస్ అధికారిణి

అంగన్‌వాడీలో పోషణమాసం

మోర్తాడ్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండలంలోని దొన్కల్ గ్రామంలోని అంగన్‌వాడీలో గురువారం మండల స్థాయి పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు హాజరయ్యారు. అందులో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు పరుగు పందెం, ప్రైమరీ స్కూల్ పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతేకాక తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం బాలింతలకు, ఆడపిల్ల జన్మించిన తల్లులకు పాపకు సంబంధించిన కిట్లను అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భీమ్‌గల్ సీడీపీవో, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దృశ్యం

అధ్యాపకుల నిరసన

భీమ్‌గల్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసనగా గురువారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సతీష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశ అత్యున్నత హోదాలో ఉన్న సీజేఐపై దాడి జరగడం మాయని మచ్చ అని అన్నారు. దీనిని పౌర సమాజం నిరసన ద్వారా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, సుమలత, పడగల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని కలిసిన బోధన్ నేతలు

బోధన్, అక్టోబరు9, (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం బోధన్ మండల అమ్దాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోధన్‌లోని రాజకీయ అంశాలపై చర్చించినట్లు మాజీ ఎంపీటీసీ విఠల్ గౌడ్ తెలిపారు. ఆయనతో పాటు గ్రామ బీజేపీ నాయకులు తదితరులున్నారు.


ఈటలను కలిసిన బీజేపీ నాయకులు

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీడీ కార్మికులు

కోటగిరి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 2వ రాష్ట్ర మహసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సిద్ది రాములు కోరారు. ఈ మేరకు గురువారం కోటగిరి మండలంలోని ఎత్తొండలో రాష్ట్ర మహసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ తేదీన తిలక్ గార్డెన్ నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పాత కలెక్టర్ కార్యాలయ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. 12వ తేదీన తిలక్ గార్డెన్ న్యూ అంబేద్కర్ భవన్‌లో ప్రజాప్రతినిధులతో సభ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు పలువురు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. మహసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘం కోశాధికారి సయ్యద్, మారుతి, లక్ష్మి, శారద, అనిత, నిఖిత, అంజలి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముత్త గంగారెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్త గంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అర్గుల్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం శాయాశక్తులా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల అభ్యర్థులకు సంబంధించి గ్రామాల వారిగా వివరాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ టీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ గౌడ్, కంచెట్టి గంగాధర్, మండల తహసీల్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సొసైటీ చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, మాజీ ఎంపీపీలు అప్పల పెద్ద రాజన్న, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్

బోధన్,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీఐ చట్టం పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించాలి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల సంబంధిత అధికారులతో తమ సంస్థల్లో పని చేస్తున్న పీఐవో, ఏఐవోలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెరుగైన సమాజ నిర్మాణంలో విద్యార్థులది కీలకపాత్ర అని, అభివృద్ధి అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజలకు, ప్రభుత్వాలు పారదర్శక పాలన అందించే విషయంలో ప్రజలు బాధ్యతయుతమైన పౌరులుగా చొరవ చూపాలన్నారు. సమాచార హక్కు చట్టం సామాన్యులకు ఆయుధమని, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ప్రజా ప్రయోజనం లక్ష్యంగా అస్త్రాన్ని సంధించి లబ్ధి పొందవచ్చాన్నారు. అవినీతి అక్రమాలను ఎదురించవచ్చని పేర్కొన్నారు. సమాచార హక్కుచట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


వన్నెల్(బి) పంచాయతీని తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

ముప్కాల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్(బి) గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో శివకృష్ణ గురువారం తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అదే విధంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య పనులను నిర్వహించాలని సూచించారు. తాగు నీరు, మురికి కాలువలు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సెక్రటరీని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, సెక్రటరీ రాజశేఖర్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు షురూ

రెంజల్,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఐకేపీ ఏపీఎం మోహన్ అన్నారు. మండలంలోని బాగేపల్లి, కూనేపల్లి, దండిగుట్ట, దూపల్లి గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకూడదన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు శ్యామల, భాస్కర్, కృష్ణ, శివ, మహిళ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో ఐకేపీ ఆధ్వర్యంలో..

మోస్రా,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ రాజశేఖర్, ఐకేపీ ఏపీఎం గంగాధర్ ప్రారంభించారు. ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని తహసీల్దార్ సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. తూకంలో గాని హమాలీ పరంగా, గన్నీ సంచుల విషయంలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఏఈవో సప్తగిరి, మహిళా సంఘ సీసీలు, వీడీసీ పెద్దలు పోతారెడ్డి, స్వామి గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పట్టణాధ్యక్షుడిగా మహ్మద్

బోధన్,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షుడిగా షేక్ మహ్మద్ నియమితులయ్యారు. గురువారం జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు ఆయన నియమాకానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాంకృష్ణ, రాష్ట్ర ఈసీ మెంబర్ నీరడి ఈశ్వర్ షేక్ మహ్మద్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. బీసీ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తానని మహ్మద్ పేర్కొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జక్రాన్‌పల్లి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామ సింగిల్ విండో ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి తెలిపారు. మండలంలోని జక్రాన్‌పల్లి, పడకల్, కేశ్‌పల్లి, పుప్పాలపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని ఆయన కోరారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు.

దెబ్బతిన్న రోడ్డుకు మోక్షమెప్పుడో?

- కోతకు గురైన రోడ్డుతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

భీమ్‌గల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కోతకు గురైన భీమ్‌గల్, బడా భీమ్‌గల్ గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి కోతకు గురైంది. ప్రతినిత్యం వందల వాహనాలు నడిచే రహదారి కోతకు ఇప్పటికీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బడాభీమ్‌గల్, చేంగల్, సికింద్రాపూర్, గోన్‌గొప్పుల గ్రామాల ప్రజలు రవాణాకు నానా అవస్థలు తప్పడం లేదు. ఆగస్టు 27న కురిసిన భారీ వర్షం వల్ల బడా భీమ్‌గల్ బ్రిడ్జి వద్ద ప్రధాన రహదారి ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కానీ నేటికీ 20 రోజులు గడుస్తున్నను రోడ్డుకు మాత్రం మరమ్మత్తులు చేపట్టలేకపోతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితులలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆదమరిస్తే అంతే..

భారీ వర్షాల వల్ల వంతెన ప్రారంభంలో ఏర్పడ్డ గొయ్యి ప్రమాద భరితంగా మారింది. క్రింది భాగంలో మట్టి కూలిపోవడంతో రోజురోజుకు గుంత పెద్దదిగా మారుతుంది. దాని పక్కనుండే వెళుతున్న ద్విచక్ర వాహనదారులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. వరద ఉధృతికి వంతెన మధ్య భాగం కూడా ఒకవైపు ఒరిగిన తప్పేది లేక అదే వంతెనపై ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.


కోతకు గురైన ప్రధాన రోడ్డు


పూర్తి ఆనవాళ్లు కోల్పోయిన ప్రధాన రహదారి

తిరిగి రావాలసిన పరిస్థితి ..

మండలంలోని గోన్‌గొప్పుల, సికింద్రాపూర్, చేంగల్, బడా భీమ్‌గల్ నుంచి భీమ్‌గల్ కు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు బంద్ కావడంతో బస్సులలో వచ్చేపై గ్రామాల ప్రజలకు ప్రైవేటు వాహనాలలో అక్లూర్, మోతే మీదుగా భీమ్‌గల్ చేరుకుంటున్నారు. ఈ దారి వెంబడి రవాణా స్థంభించడంతో భీమ్‌గల్ వచ్చేందుకు వృద్దులు నానా అవస్థలు పడుతున్నారు.

పరిశీలించిన పనుల్లో జాప్యం ..

భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్లను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్, కార్పోరేషన్ ఛైర్మన్ లు ఈరవత్రి అనిల్, మానా లమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి లు పరిశీలించారు. కానీ ఇప్పటికీ పనులు చేపట్టవకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి రోడ్డు మరమ్మతులను చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని సులువు చేయాలని కోరుతున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి


అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొక్కజొన్న పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మద్దతు ధరతో మొక్కజొన్న సేకరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తీసుకెళ్లారని ఈ విషయంపై తాను వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాసిన విషయాన్ని అన్వేష్‌రెడ్డి తెలిపారు. మొక్కజొన్న పంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు కొనుగోళ్లకు ఎందుకు రాలేదని సీఎం సూచనతో రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. గత సంవత్సరం కూడా కేంద్రం కేవలం మద్దతు ధర ప్రకటనకే పరిమితమైందని ఎలాంటి కొనుగోలులు జరపకపోయిన రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 535 కోట్లు ఖర్చు పెట్టి మొక్కజొన్నకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే 13 నుంచి మధ్యాహ్న భోజనం నిలిపివేస్తాం



మోర్తాడ్‌లో ఆందోళన నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మోర్తాడ్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న బోజన నిర్వహణ దారులకు ఈ నెల 10 వరకు పెండింగ్ డబ్బులు రాకుంటే 13 నుంచి పూర్తిస్థాయిలో మధ్యాహ్న బోజన పథకాన్ని నిలిపివేస్తామని యూనియన్ నాయకులు చక్రపాణి అన్నారు. గురువారం మోర్తాడ్‌లో మధ్యాహ్న బోజన కార్మికులతో ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన గ్రీన్‌చానల్ విషయంలో ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. ప్రతీ నెల బిల్లులు ఇవ్వాలని కోరగా ప్రభుత్వం గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసిందని గత నెల 10వ తేదీ వరకు ఇస్తామన్న ఇప్పటికి అమలు కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా గ్రీన్ చానల్ ద్వారా ఇప్పటి వరకు సంవత్సరం నుంచి కోడిగుడ్ల బిల్లులు, రెండువేల వేతనం, 9, 10 వ తరగతుల బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఇప్పటి వరకు పదివేల కోట్ల రూపాయలు మధ్యాహ్న బోజనా బకాయిలు ఉన్నాయని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సవిత, బాబాయి, గోవింద్, పద్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాయిదాతో కుంటుపడుతున్న అభివృద్ధి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ శ్రేన్నికలు పదవీకలం గత సంవత్సరమే పూర్తయ్యాయని గ్రామాల్లో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది కానీ ఎన్నికలు జరగకపోవడంతో నిధులు లేక అభివృద్ధి జరగడం లేదని అన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు లేకపోవడంతో పాటు వీధిలైట్లు లేక, రోడ్లు మరమ్మతులు లేక అవస్తలు పడుతున్నారని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు హైకోర్టులలో వాయిదాలు పడటం మూలంగా ఎన్నికలు వాయిదా పడుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ బిల్లు ఆమోదించి ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నామినేషన్‌కు ప్రత్యేక కౌంటర్లు

నవీపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ స్థానంతో పాటు మండలంలోని వివిధ ఎంపీటీసీ స్థానాల ఎన్నికకై గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ స్థానం కోసం ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయగా ఎంపీటీసీ స్థానాల కోసం మరో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ ఎన్నికల ప్రత్యేక అధికారిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ వ్యవహరించారు. పలు గ్రామాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ల దాఖలు కోసం ఫారాలను వెంట తీసుకెళ్లగా సాయంత్రం వరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

బాన్సువాడ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపుపై గురువారం బీఆర్ఎస్ జంగు సైరన్ మోగించింది. హైదరాబాద్‌లోని బస్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. కాగా బాన్సువాడ పట్టణంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు జుబేర్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ శిబిరం



ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత భవన్‌లో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. తల్లిదండ్రులు దివ్యాంగులకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళలో వ్యాయామం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ టీచర్ వెంకట పద్మ, వసంత్, అనిల్ తదితరులున్నారు.

బాక్సింగ్‌లో కేజీబీవీ బాలికల ప్రతిభ

దిలావర్‌పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 జోనల్స్థాయి బాక్సింగ్ పోటీల్లో దిలావర్‌పూర్ కేజీబీవీ బాలికల ప్రతిభ కనబరిచి బంగారు, వెండిపతకాలు సాధించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో కేజీబీవీలో ఇంటర్ మొదటిసంవత్సరం చదువుతున్న పల్లవి జోనల్‌స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకం సాధించింది.

యువత పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్

సుభాష్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువత పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని నినాదాలతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా 60 రోజుల పాటు జరుగుతుందని అన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలో పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కనీసం 30 గ్రామాలను టొబాకో ఫ్రీ గ్రామాలుగా గుర్తించడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ ద్వారా పొగ ఉత్పత్తులను అక్రమంగా అమ్మేవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే పొగాకు ఉత్పత్తులు వాడడం ద్వారా విద్యార్థుల యొక్క భవిష్యత్తు నాశనం అవుతుందని, శరీరక మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు గుండె జబ్బులు, క్యాన్సర్, లాంటి ప్రాణాంతకమైన వ్యాధులకు గురయ్యే ఆస్కారం ఉందని అన్నారు. జిల్లా సైకియాట్రిక్ డాక్టర్ రవితేజ మాట్లాడుతూ విద్యార్థులు పాన్‌పరాగ్, గుట్కా, సిగరేట్, డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉత్తర మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్‌వీఎన్ గౌడ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సామ్రాట్‌యాదవ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణలక్ష్మి, ఆర్‌బీఎస్‌కె వైద్యులు విజయభాస్కర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ కస్తూరి గంగాకిషన్, వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

మున్సిపల్ శాఖ సమాచార హక్కు చట్టం అధికారుల నియామకం

సుభాష్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖలో సమాచార హక్కు చట్టం అధికారుల నియామక ఉత్తర్వులను మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్ జారీ చేశారు. ప్రజాసమాచార అధికారిగా రవిబాబు నియామకం కాగా మెప్మాపీడీ రమేష్, రెవెన్యూకు స్వప్న, ఎస్టాబ్లిష్‌మెంట్‌కు ప్రకాష్, జనన, మరణ ధృవీకరణకు రాజేశ్వరి, టౌన్‌ప్లానింగ్‌కు శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, ఇంజనీరింగ్‌కు సుదర్శన్‌రెడ్డి, అకౌంట్స్‌కు అర్చన, ఎస్టాబ్లిష్‌మెంట్ ఔట్ సోర్సింగ్‌కు నజీర్, సానిటేషన్‌కు రవిబాబు, ఎలక్షన్‌కు ఇర్ఫాన్ అహ్మద్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్


నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

సిరికొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం నుంచి ప్రారంభమైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రానికి వచ్చిన ఆయన ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి నాగోరావులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లను చేసుకోవాలని ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

సాలూర, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పద్మ అన్నారు. గురువారం సాలూరలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్న ప్రాసన పాటు గర్భిణులకు సీమంతం, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమాచార చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఇందూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమాచార చట్టం ప్రవేశపెట్టి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గురువారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారులు ఎల్‌సీడీ తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. సమాచార హక్కు చట్టం అమలుపై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేయించిన ప్రతిజ్ఞలో అన్ని శాఖల పీఐవో, ఏపీఐవోలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని స్వచ్చందంగా ఇవ్వవల్సిన సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉండేలా వ్యవహరిస్తామని పనితీరులో పారదర్శకతను జవాబుదారితనాన్ని పాటిస్తూ పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సమాచార చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ జిల్లాకు కూడా అవార్డులు సాధించి ప్రత్యేక గుర్తింపు తేవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, కలెకలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంథనిలో పొలం బాట


కులంబాటలో హాజరైన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది

ఆర్మూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంథని గ్రామంలో గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లో వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేస్తామని, అంగిపోయిన, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఏఈ శ్రావణ్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ ముజీబ్, లైన్‌మేన్ శ్రీనివాస్, ఏఎల్ఎం లింబాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

కంకర వేశారు..తారు మరిచారు

- నిలిచిన దొంచంద- తడపాకల్ బీటి రోడ్డు పనులు
- మూడేళ్లు కావస్తున్నా పూర్తికాని వైనం
- పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొంచంద నుంచి తడపాకల్ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా నేటికీ పనులు పూర్తికాలేదు. దీంతో అక్కడి రైతులకు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొంచంద నుంచి తడపాకల్ వరకు 3.700 కిలో మీటర్ల మేర ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.3.92 కోట్లతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి వేసి దానిపై కంకర వేసి అక్కడక్కడ కల్వర్టు నిర్మాణాలు చేసి వదిలేయగా రోడ్డు పనులు నిలిచి పోయాయి. తమ వ్యవసాయ క్షేత్రాలకు రోడ్డు పడిందని ఆశతో ఉన్న దొంచంద, తడపాకల్ రైతులు నిరాశ చెందారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన కంకరతో రోడ్డుపై తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బం దులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దుమ్ము, దూళితో పంటలు పాడవుతున్నా యని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.


దొంచంద- తడపాకల్ గ్రామాల మధ్య మట్టి, కంకర వేసిన రోడ్డు

పంట చేలలో గంజాయి సాగు

- పత్తి, కంది పంటల్లో అంతర పంటగా గంజాయి
- పంట చేళ్లలో 160 గంజాయి మొక్కల స్వాధీనం
- స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.16 లక్షలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలం అశోదగ్రామంలో పంటపొలాల మధ్య భారీ ఎత్తున గంజాయి మొక్కలు పెంచుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ ప్రత్యేక బృందంతో పంటచేలలో అంతర పంటగా పెంచుతున్న గంజాయి మొక్కలను పట్టుకున్నట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామీణ మండలంలోని అశోద గ్రామంలో అంతర పంటగా సాగు చేస్తున్న 160 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు మిశ్రం భుజంగ్‌రావును అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.16 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. గంజాయి పండిస్తున్నవారి పట్ల కేసులో నమోదుచేసి వారికి ప్రభుత్వపథకాలు వర్తించకుండా కలెక్టర్‌కు నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంత భారీఎత్తున గంజాయిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన రూరల్ సీఐ కె.ఫణిధర్, రూరల్ ఎస్సై వి.విష్ణువర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్ ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించినట్లు తెలిపారు.

ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

● టీఎన్ఎస్ఎఫ్ డిమాండ్


వీసీకి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఇందల్వాయి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఉన్న ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ తదితర కోర్సులకు సంబంధించిన ఇటీవల కౌన్సెలింగ్ పూర్తి చేసి సీట్లు భర్తీ చేశారని మిగిలిన సీట్ల ను వెంటనే పూర్తి చేయాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గురువారం వైస్‌చాన్సిలర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 100 శాతం సీట్లు భర్తీ చేస్తామని చెప్ప డం జరిగిందని వెంటనే విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్లు పెట్టి మిగిలిన సీట్లను భర్తీ చేయాలని కోరారు. వీసీకి వినతి పత్రం అందజేసిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శివ, లక్ష్మణ్, శ్రవణ్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

దక్కన్ సర్కార్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నటి విజయశాంతి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ రచయిత జిల్లాకు చెందిన కళా శ్రీనివాస్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన దక్కన్ సర్కార్ సినిమా పోస్టర్‌ను నటి, ఎమ్మెల్సీ విజయశాంతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దక్కన్ సర్కార్ పోస్టర్‌ను సినీ యూనిట్ బృందంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వానికి అద్దంపట్టే విధంగా సినిమా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తెలంగాణ ప్రాంతం నుండి వచ్చే సినిమాలకు సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మురళిదేశ్ పాండే, చిత్ర ప్రధాన నటుడు చాణక్య, నటి మౌనిక, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు హైకోర్టు స్టే ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. ఇది రేవంత్‌రెడ్డి ఆడుతున్న నాటకం అని బీసీల మీద రేవంత్‌రెడ్డి కపట ప్రేమ న్యాయవ్యవస్థపైన సరైన అవగాహన లేక కాలయాపన చేస్తున్నారని అన్నారు. బీసీలకు 42 శాతంలో మైనార్టీ ముస్లీంలకు 10 శాతం కలపడం బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ మీద రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

ఆరోగ్యానికి వెరీ గుడ్డు

(3వ పేజీ తరువాయి)

కంటే ఉడికిన గుడ్డు మంచిది. రోజు రెండు గుడ్లు తిన్నచో ఉబకాయం రాదు. శరీరం గుండె ఆరోగ్యంగా పని చేయుటకు ఉపయోగపడే దాతులు 45, ఇందులో 44 దాతువులు గడ్డులోనే ఉన్నాయి. గుడ్డులో ప్రోటీన్లు 6.5 గ్రాములు శక్తి 77 కేలరీలు, ఖనిజాలు 12, లవణాలు 8, జీవ పోషకాల నిధి, 12 రకాల విటమిన్లు కొవ్వులో కరిగే విటమిన్లు వేడికి నీటిలో కరిగే విటమిన్లు ఏ,డీ,ఈ,కే నీటిలో కరిగే విటమిన్‌లు బీ1,బీ2,బీ6,బీ12, పోలిక్ యాసిడ్ తదితరవి ఉన్నాయి. గుడ్లు ఆరోగ్యానికి మంచివి. గుడ్డు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం. పెద్దలు, పిల్లలు, వృద్ధులు ప్రతిరోజు కనీసం ఒక గడ్డు తినడం అలవాటు చేసుకోవాలి. ఇది శరీరానికి శక్తిని, మనసుకు చురుకుదనాన్ని ఇస్తుందని వైద్యులు సైతం పేర్కొంటున్నారు.

పిల్లల పెరుగుదలలో గుడ్డుకు ప్రాధాన్యం..

పిల్లల ఎత్తు, బలం, మెదడు అభివృద్ధికి గడ్డు చాలా అవసరం. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో గడ్డును అందిస్తున్నారు. పేదరికం, పోషకాహార లోపం ఉన్న కుటుంబాలకు గడ్డు ఆర్థికంగా అందుబాటులో ఉండే ఉత్తమ ఆహారమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దేశంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో రెసిడెన్షియల్ హాస్టళ్లలో సైతం విద్యార్థులకు గుడ్లు తప్పనిసరిగా ఆహారంలో చేరుస్తున్నారు. విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు గడ్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పుకోవచ్చు.

భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో ముందంజ..

భారత దేశం ప్రపంచంలో గుడ్ల ఉత్పత్తిలో మూడవ స్థానంలో ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలు ప్రధాన ఉత్పత్తి కేంద్రాలున్నాయి.

వివిధ రకాల వంటలలో అద్భుతమైన రుచులు..

బాయిల్డ్ ఎగ్, ఆమ్లెట్, బుర్జీ, కర్రీ, పులావ్, కేకులు, బేక్ పదార్థాలు - ఎక్కడ చూసినా గడ్డు రుచుల పండుగే. అన్ని వయస్సుల వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహారమని పోషక నిపుణులు చెబుతున్నారు.

సన్నాలకే మొగ్గు

(3వ పేజీ తరువాయి)

రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సీజన్‌లోనైన సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తెగుళ్ల బారిన సన్నాలు

జిల్లాలో సన్నాలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా అగ్గి తెగుళ్ల, పచ్చ దోమ తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. మరికొన్ని చోట్ల కోతలకు సిద్ధమయ్యాయి. ఈ దశలో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తుండడం రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంటను తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారు



మాట్లాడుతున్న ఏలేటి భూంరెడ్డి

సదాశివనగర్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఛీ కొడుతున్నారని గమనించే స్వచ్ఛందంగా పార్టీ నుంచి తప్పుకున్నానని ఏలేటి భూంరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటన చేయడం హాస్యాస్పదమన్నారు. బీఆర్‌ఎస్‌లో ప్రజాసేవ కోసం పనిచేస్తున్న తనను ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానిస్తేనే వెళ్లానని తెలిపారు. పార్టీలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూస్తే దారుణంగా ఉందని, ఎవరి వారే యమునా తీరే అన్నచందంగా పీఏల నుంచి స్థానిక లీడర్ల వరకు నైతిక విలువలు లేకుండా ఉన్నారని తెలిపారు. ఇది గమనించి మళ్లీ బీఆర్‌ఎస్ చేరడానికి వారం రోజుల ముందు హరీష్‌రావును కలిశానని చెప్పారు. ఇకనైనా ఎమ్మెల్యే పార్టీ పరిస్థితులను గమనించి త్వరలో సరిచేస్తేనే పార్టీకి గౌరవం ఉంటుందన్నారు. త్వరలోనే హరీష్‌రావు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

13న జిల్లాస్థాయి పోటీలు

సుభాష్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపికలను తక్షణమే పూర్తి చేయాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి గురువారం తెలిపారు. జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో ఎంపికైన జోనల్ జట్లకు మాత్రమే ఆడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాస్థాయి టోర్నమెంట్‌కి అక్టోబరు 13న డీఎస్‌ఏ మైదానంలో ఉదయం 10గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. పోటీలో ఎంపికైన జట్లు అక్టోబర్ 16న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి మీట్‌లో పాల్గొంటాయని తెలిపారు. వాలీబాల్ అండర్-17 విభాగంలో బాలబాలికలు జనవరి 1, 2009 తర్వాత, కబడ్డీ అండర్-14 విభాగంలో బాలబాలికలు జనవరి 1, 2012 తర్వాత జన్మించి ఉండాలన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారిణి

సుభాష్‌నగర్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని సిజేరియన్ శస్త్రచికిత్సపై వేసిన ఆడిట్ టీమ్ సభ్యులతో జిల్లా వైద్యశాఖ అధికారిణి రాజశ్రీ సమీక్ష నిర్వహించారు. గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రులన్నీ కూడా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఈ రెండింటి ద్వారా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా సర్టిఫికేట్ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో జరిగిన సీ-సెక్షన్‌పై ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని గర్భిణులకు మౌలిక సదుపాయాలన్నీ ప్రైవేటు ఆసుపత్రిలో కల్పిస్తున్నాయా లేదా పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రి వారు వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని, ఫైర్ ప్రమాద నివారణ వసతి, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, టారీఫ్ ఛార్జీల చార్ట్ వెయిటింగ్ హాల్‌లో ప్రదర్శించాలన్నారు. అనవసర శస్త్రచికిత్సలు నిర్వహించాలని, ఆర్‌ఎంపీ, పీఎంపీలకు పర్సంటేజీల ఆశ చూపుతూ అనవసర శస్త్రచికిత్సలు చేయరాదన్నారు. ప్రతి ఆసుపత్రిని మూడు నెలలకోసారి సందర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్వేత, సుప్రియ, అశ్విని, వివిధ వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

సర్వే ల్యాండ్ రికార్డ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్, అక్టోబరు9, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ స్పెషల్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారులు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికృ ష్ణ, కార్యదర్శిగా నవిత, కోశాధికారిగా నరేంద ర్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులతో కూ డిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. అందరి సహకారంతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కార్యదర్శి నాగరాజు, జిల్లా సహ అధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, కేంద్రసంఘం ఈసీ మెంబర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు

గాంధారి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల వేళ వివిధ రాజకీయ పార్టీల్లో చేరికల పర్వం మొదలైంది. మండలంలోని గండివేట్ కాంగ్రెస్ కార్యకర్తలు చిటికు రమేష్, పాలకుర్తి శివకుమార్, గండివేట్ తాండాకు చెందిన నెనావత్ నర్సింగ్ గురువారం కాంగ్రెస్‌ను వీడి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే అబద్ధపు హామీలకు, బూటకపు మాటలకు విసిగిపోయి కాంగ్రెస్ నుంచి పెద్దఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శివాజీరావు, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, షారుఖ్, ఉప్పు సాయిలు, గంగాధర్, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

రైతులను చిన్నచూపు చూడటం తగదు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను చిన్నచూపు చూడడం తగదని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలని, ఎరువులను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని తెలిపారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు భూమన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, జిల్లా సహాయ కార్యదర్శి బాలరాజు, నాయకులు దేవయ్య, మోతేబాలరాజ్, సాయాగౌడ్, సాయిలు,హనుమన్లు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సీజేఐపై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని సీపీఎం ర్యాలీ నిర్వహించింది. జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు మద్దతు పలికారు. జిల్లాకేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

కరీంనగర్‌లో కప్పు కొట్టిన అటవీ సిబ్బంది

కామారెడ్డిటౌన్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో జిల్లా అటవీశాఖ సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కామారెడ్డి జిల్లా అటవీశాఖాధికారి నిఖిత క్యారమ్‌లో మొదటిస్థానం, కబడ్డీ పురుషుల, మహిళ విభాగంలో మొదటిస్థానం, వాలీపల్ పురుషుల విభాగంలో మొదటిస్థానం, టగ్ ఆఫ్ వార్, షటిల్‌బాట్‌లో మొదటిస్థానం, అథ్లెటిక్స్‌లో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి క్రీడపోటీల్లో ఎంపికయ్యారు.



గెలిచిన కప్పు చూపుతున్న అటవీశాఖ సిబ్బంది

బీడీ కార్మికులకు పింఛన్ అందించాలి

కామారెడ్డి రూరల్, అక్టోబరు 09 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు ఫించన్లను అందించాలని బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న జీవనభృతి రూ.2016లను 2014 సంవత్సరం వరకు కట్ ఆఫ్ తేదిని ఉపసంహరించకొని బీడీ కార్మికులందరికి ఇవ్వాలని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ ప్రచారంలో ఇచ్చినటువంటి హామీని రూ.4016ల జీవనభృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ మంత్ర సీతాక్క ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటనలో భాగంగా ఈ జీవనభృతిని తక్షణమే అమలు చేస్తామని హామీ ఇవ్వాలని కోరారు. లేని యెడల బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులను ఏకం చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళనల కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సత్యం, జిల్లా కమిటీ సభ్యులు కన్న ప్రభుదాస్ తదిరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అన్నదాతలకు అందుబాటులో విత్తనాలు

గాంధారి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులు రబీలో వేసేందుకు శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని విండో కార్యదర్శి సాయిలు గురువారం తెలిపారు. 25కిలోల బస్తా రూ.2085కు అందిస్తున్నామని చెప్పారు. విండోలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేట్ సంగంలో వాలీబాల్ పోటీలు

గాంధారి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేట్‌సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్జీఎఫ్ పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ ఎంపిక పోటీలను నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధారి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాలకు చెందిన అండర్- 14, 17 బాలబాలికలకు జిల్లా స్థాయికి వెళ్లేందుకు ఎంపిక పోటీలను నిర్వహించామని తెలిపారు.ఈ నెలలో జిల్లాస్థాయి పోటీలు జరగనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



నాయకులకు అరెస్ట్ చేసిన పోలీసులు

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

భిక్కనూరు, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఛలో బస్‌భవన్ పిలుపుమేరకు భిక్కనూరు మండల బీఆర్‌ఎస్ నాయకులు తునికి వేణు, అత్తెల్లి శ్రీనివాస్, దయారి సాయిరెడ్డి, కందడి రమేష్‌రెడ్డిని గురువారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పెంచిన ఛార్జిలను వెంటనే తగ్గించాలని లేని యెడల తీవ్ర పరిణామాలు ఉంటాయని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.



వాహన విక్రయదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మహేష్

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 9,(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వాహనాల అంగడిలో గురువారం ట్రాఫిక్ ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించి ఆర్‌సీ, లైసెన్స్ దగ్గర పెట్టుకోవాలని తెలిపారు. వాహనానికి సంబంధించి ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. కొనుగోలు దారులు సైతం అన్ని పత్రాలు పరిశీలించిన తర్వాతనే వాహనాలను కొనుగోలుచేయాలని తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నర్సింగ్‌రావు

విజేతలకు బహుమతులు

మాచారెడ్డి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఎల్‌ఎస్‌ఆర్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం మాజీ ఎంపీపీ లోమపల్లి నర్సింగ్‌రావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 30వ తేదీన ప్రారంభైన ఈ క్రీడా పోటీల్లో క్రీడాకారులకు ప్రతిరోజు భోజన సౌకర్యంతో పాటుగా స్పాన్సర్‌గా వ్యవహరించి రూ.75వేలను అందించినట్లు తెలియజేశారు. మొదటి స్థానంలో నిలిచిన జబ్బీర్ జాగ్వర్ నవీన్ జట్టుకు రూ.20వేలు, కప్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎన్‌ఎంటీ కింగ్స్ శ్రీను జట్టుకు రూ.10వేలు, కప్ అందించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడల్లో వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తనతో పాటుగా పలువురు స్పాన్సర్స్‌గా ఉన్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు, వివిధ గ్రామాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎల్లారెడ్డి విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎల్లారెడ్డి మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఫర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధారి మండలంలోని పేట్‌సంగంలో నిర్వహించిన అండర్-14 విభాగంలో షేక్ ఆయాన్, ప్రదీప్‌గౌడ్, మహ్మద్ అనాజ్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ మేరకు వారిని ప్రిన్సిపాల్ అభినందించి జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, మజూర్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, దత్తాత్రేయ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఫర్



బీజేపీలో చేరుతున్న నాయకులు

భారతీయ జనతా పార్టీలో చేరికలు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామానికి చెందిన వడ్ల శేఖర్, పలువురు నాయకులు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు సమక్షంలో బీజేపీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిదుర సాయిలు, కార్యదర్శి శంకర్‌గౌడ్, తుప్తి ప్రసాద్, సున్నం సాయిలు, ప్రకాష్ పటేల్, కోణాల గంగారెడ్డి, గుడుగుట్ల శ్రీనివాస్, హన్మాండ్లు యాదవ్, నాగరాజు, రాజారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే: మాజీ ఎమ్మెల్యే

సదాశివనగర్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో గురువారం కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆ మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డులను ఎల్లారెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా ఇంటింటికి చేరేలా కార్యకర్తలు, నాయకులు చూడాలని సూచించారు. స్థానిక సంస్థలు ఎన్నికలు జరపకుండా కాలయాపన చేస్తూ కోర్టు కేసుల పేరుతో, రిజర్వేషన్ల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్‌పై నమ్మకం లేకనే చాలామంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

10న తైక్వాండో పోటీలు

సుభాష్‌నగర్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 69వ అండర్-14 బాలబాలికల తైక్వాండో పోటీలను అక్టోబర్ 10వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నిజామాబాద్ జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శి నాగమణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పోటీలు నగరంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పోటీలకు మొత్తం పది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ పోటీలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉన్నా, ఇతరత్రా పూర్తి వివరాల కోసం 9347216426 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కోతకు వచ్చినా.. మందు కొట్టాల్సిందే

● వరిలో పురుగుల బెడద ● సూచనలు చేయాలని అన్నదాతల అభ్యర్థన

బాన్సువాడ రూరల్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం శివారులో జుక్కలదాని తాండా గ్రామానికి చెందిన వరి పంట కోత దశకు వచ్చినప్పటికీ పురుగుల మందు పిచికారీ చేయాల్సి వస్తోందని రైతు రూప్‌సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పొలాలలను కాపాడుకునేందుకు ఓ పక్క రైతులు కష్టపడుతుంటే వ్యవ సాయ విస్తీర్ణ అధికారులు మాత్రం రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంటలకు వచ్చిన ఎండు తెగులు, కొంకి తెగుల నివారణకు రైతులకు అవగాహన కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న రైతు రూప్‌సింగ్

డిజిటల్ బోధనతో ఎన్నో మార్పులు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు డిజిటల్ పుస్తక విద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో నాగేశ్వర్‌రావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా బాన్సువాడ మండలంలోని కొత్తబాద్ ఆదర్శ పాఠశాలలో డివిజన్‌లోని 11 మండలాల పరిధిలోని 225మంది ఉపాధ్యాయులకు ఆరవ తరగతి నుంచి 9వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో బాగంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ శిక్షణ ద్వారా గణితం, సైన్స్ సబ్జెక్టులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో సిలబస్‌ను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు జనార్దన్, రాజేష్, శ్రీనివాస్, అనిల్, సంధ్యా, తాహేర్‌బేగం, హన్మాండ్లు, వీరప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	ఓజీ
వెంకటేశ్వర	కాంతార

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230